# రద్దు పేరుతో.. ముంచేస్తున్నారు!

## పెద్దోళ్లకు చెందిన వేల కోట్ల రుణాల రద్దు..

- ఆ లోటును పేదల సొమ్ముతో భర్తీచేస్తున్నారు..
- బ్యాంక్స్ నిధులు, లాభాలతో వాటి సర్దుబాట్లు
- మూలధనీకరణ పేరుతో మరింతగా సాయం
- మోడీ హయాంలో తారాస్థాయికి రుణరద్దులు
- మూడేండ్లలో 2.5 లక్షల కోట్ల చేరిన 'రై'టాఫ్..




Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

**రుణాల ఎగవేతదారుల విషయంలో వాణిజ్య బ్యాంకులు ప్రవర్తిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తోంది. వేల కోట్ల రుణాలను బ్యాంకుల నుంచి సమీకరించిన బడాబడా పెట్టుబడిదారులు ఉద్దేశపూర్వకంగా వాటిని తిరిగి చెల్లించడం లేదు. అయినా బ్యాంకులు వీరిపై కఠిన చర్యలను అమలు చేయట్లేదు. కేవలం తూతూ మంత్రంగా రికవరీ చర్యలు చేపట్టి.. వాటిని రద్దు చేసిన రుణాల ఖాతాలోకి మళ్లించేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నాయి. వేల కోట్ల రూపాయల ప్రజా సొమ్మును బ్యాంకు రుణాల రూపంలో పొందిన బడాబాబులు మాత్రం.. ఆ సొమ్మును వివిధ మార్గాల్లో ఇతర వ్యాపారాల్లోకి మళ్లించి లక్షల కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇంతా జరుగుతున్నా.. వివిధ రకాల ఒత్తిళ్ల కారణంగా ఎగవేతదారుల నుంచి రుణాలను వసూలు చేయడంలో సీరియస్‌నెస్ చూపలేకపోతున్న బ్యాంకర్లు .. కనీసం వారి పేర్లను కూడా బయటపెట్టే సాహసం చేయడంలేదంటే పరిస్థితి అర్థ చేసుకోవచ్చు. ఈ వ్యవహార తీరు ఆధునిక పెట్టుబడిదారు అనుకూల విధానాలను అమలవుతున్న దేశానికి భారత్‌ను ఒక ఉత్తమ ఉదాహరణగా నిలుపుతున్నాయన్న విమర్శలు వినవస్తున్నాయి.**

నవతెలంగాణ, వాణిజ్య విభాగం

### మూడేండ్లలో రూ.2.5 లక్షల కోట్లు రద్దు...

దేశంలో పరపతి ఉన్న బడాబాబులు ప్రభుత్వ వర్గాలతోనూ జరుపుతోన్న లాబీయింగ్ కారణంగా ఇటీవల కాలంలో పెదోళ్ల రుణాల రద్దు ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతోందన్న విమర్శలు వినవస్తున్నాయి. బ్యాంకులు ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల మేర నిరర్థక ఆస్తుల బెడదతో సతమతమవుతున్నాయి. గడిచిన మూడేండ్ల కాలంలో బ్యాంకులు దాదాపు రూ.2.4 లక్షల కోట్ల రుణాలను రద్దు చేశాయి. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే గడిచిన దశాబ్ద కాలంలో బ్యాంకులు రద్దు చేసిన బాకీల్లో దాదాపు 80 శాతం అప్పులు గత ఐదేండ్ల కాలంలోనే నమోదు కావడం విశేషం. 2014 ఏప్రిల్ నుంచి బ్యాంకులు దాదాపు రూ.7 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిన అప్పుల ఖాతాలోకి మళ్లించాయి. గత ఏడాది అక్టోబరు–డిసెంబరు మధ్య కాలంలో (కేవలం మూడు నెలల కాలంలో) బ్యాంకులు రూ.64,000 కోట్ల మేర రుణాలను రద్దు చేశాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్యాంకులు రుణాలను రద్దు చేస్తున్న ప్రక్రియ జోరందుకుందని.. ఇది ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని విశ్లేషకులు చెబుతున్నారు.

### రుణ వసూళ్లు అంతంతే...

బకాయిదారు నుంచి రుణ వసూళ్లకు గాను అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో ప్రయత్నించిన తరువాత బ్యాంకులు సదరు రుణాన్ని రద్దు చేసిన ఖాతాల్లోకి మళ్లించాలి. ఇలా మళ్లించిన తరువాత కూడా బ్యాంకులు సదరు రుణ మొత్తాన్ని రాబట్టేందుకు గాను చర్యలు తీసుకొనే వీలుంటుంది. అయితే రుణాలను రద్దు ఖాతాలోకి మళ్లించడంతోనే ఆయా బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్ల క్లీనప్ చర్య పూర్తవుతోంది. దీంతో రద్దు చేసిన రుణాలను రికవరీ చేసేందుకు అటు యాజమాన్యాలు గానీ.. ఇటు సిబ్బంది గానీ పెద్దగా ఆసక్తి వ్యక్తీకరించడం లేదు. భారత్‌లో ఇలాంటి రుణాల వసూళ్ల అంశాలను విశ్లేషిస్తే కేవలం 15–20 శాతం మాత్రమే రుణ రికవరీ జరిగింది. ఈ సంఖ్య బ్యాంకులు రుణాలను రద్దు చేస్తున్న, తిరిగి మూలధనం సమకూర్చుతున్న రేటు కంటే ఎక్కువగా ఉండడం గమనార్హం.

### పెద్దోళ్లకు ఫలహారంగా పేదల సొమ్ము..

రుణాల రద్దు వల్ల బ్యాంకుల కంటే కూడా సాధారణ ప్రజానీకం అధికంగా నష్టపోతున్నట్టుగా విశ్లేషణల ద్వారా తెలుస్తోంది. బ్యాంకులు ఒక రుణాన్ని రద్దు చేస్తే.. ఆ బ్యాంక్ బ్యాలెన్స్‌షీట్‌లో ఆస్తుల విలువ తగ్గుతుంది. ఫలితంగా ఆస్తుల కంటే అప్పుల విలువ పెరుగుతుంది. ఈ లోటును తీర్చుకునేందుకుగాను బ్యాంకులు తమ లాభాల్లోంచి గానీ.. రిజర్వుల నుంచి గానీ కొంత మొత్తాన్ని కేటాయించాల్సి వస్తుంది. ఫలితంగా ఆ బ్యాంక్ ఆర్థికంగా నష్టపోతుంది. దీంతో బ్యాంకుల లాభాలు తగ్గి అవి ప్రభుత్వానికి చెల్లించే డివిడెండ్ పడిపోతుంది. ఫలితంగా సర్కారు ఖజానాకు ఆదాయం తగ్గి అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం ఏర్పడుతుంది. దీనికి తోడు బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్ముకు ఎక్కువ మొత్తంలో వడ్డీ రాకుండా కూడా రైటాఫ్స్ అడ్డుకొనే ప్రమాదం ఉంది. రుణాల రద్దు కారణంగా ప్రయివేటు సంస్థలకు ప్రజల సొమ్ము రూపంలో భారీ సబ్సిడీని అందించినట్టవుతోంది. దీనికి తోడు ఆయా బ్యాంకులను తిరిగి నిలబెట్టేందుకు గాను ప్రభుత్వం దాదాపు రూ.2.11 లక్షల కోట్ల మొత్తాన్ని బ్యాంకులకు మూలధనీకరణ సాయం కింద అందిచనున్నట్టుగా తెలిపింది. ఇది కూడా ప్రజల సొమ్మే. ప్రజలు కష్టపడి పన్నుల రూపంలో చెల్లించిన మొత్తాన్నే ప్రభుత్వం బ్యాంకులు తిరిగి మూలధన సాయం కింద అందించనుంది. అంటే పెట్టుబడిదారులు చేసిన మోసాన్ని పూడ్చేందుకు గాను ప్రభుత్వం మళ్లీ ప్రజల సొమ్మును బ్యాంకులకు అందిస్తోందన్న మాట. ఈ సొమ్ము కూడా రానున్న రోజుల్లో మళ్లీ పెద్దబాబుల జేబుల్లోకే చేరుకొనేందుకు ఎక్కువగా అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

### పేర్లు బయటపెట్టాలంటే భయం..

దేశంలో బడాబాబులకు కేంద్ర ప్రభుత్వం ఎంతగా జంకుతోందంటే.. బ్యాంకులకు వేల కోట్ల రూపాయల ఎగవేసి సమాజంలో దర్జాగా జీవనం గడుపుతోన్న ఎగవేతదారుల పేర్లను కూడా వెల్లడించేందుకు కూడా భయపడుతోంది. దేశంలోని పెద్దకోర్టు జోక్యం చేసుకొని ఆదేశాలు జారీ చేసినా రుణాల రద్దు వల్ల లబ్ధి పొందిన వారి వివరాలను బయటపెట్టేందుకు ఇష్టపడటం లేదు. సకాలంలో రుణ చెల్లింపులు జరపకపోవడం భారత్‌లో పౌరనేరం. రుణ ఎగవేతదారులు చట్టప్రకారం పౌరనేరస్తులుగా మారినప్పటికీ.. వారిపై పెద్దగా చర్యలు తీసుకోలేకపోతోంది అంటే వారికి ప్రభుత్వ అండ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పంట రుణం కిస్తీ ఒకటి చెల్లించడం కొంత అలస్యమైతేనే అన్నదాత ఇంటికి వచ్చి నానా యాగిచేసే బ్యాంకులు.. బడా ఎగవేతదారుల పేర్లను కూడా వెల్లడించేందుకు జంకుతోంది.